క్లుప్తంగా

25న దుకాణాల వేలం

ధరూరు: మండల పరిధిలోని పెద్దచింతరేవుల శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద వివిధ దుకాణాలు నిర్వహించుకునేందుకు ఈ నెల 25న వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ కవిత, ఆలయ ధర్మకర్త గిరిరావులు ఓ ప్రకటనలో తెలిపారు. 2025 సంవత్సరానికి గాను టెంకాయలు, కిరాణం ఏడాది పాటు విక్రయించేందుకు రూ.లక్ష డిపాజిట్ చేయాలని, అదే విధంగా కొబ్బరి చిప్పల సేకరణకు రూ. 50 వేలు, టూరిజం భవన వసతి గృహం నిర్వహణకు రూ. 50 వేలు డిపాజిట్ చేయాలని పేర్కొన్నారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

గద్వాల అర్బన్: ఇటిక్యాల మండలం షాబాద్‌లో ఈ నెల 15న డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బహుజన సేన జిల్లా అధ్యక్షుడు దానయ్య అన్నారు. కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను మంగళవారం జిల్లా కేంద్రంలోని పాత ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా బహుజన సేన వ్యవస్థాపకుడు డాక్టర్ కదిరే కృష్ణ, ప్రొఫెసర్ కాసీం హాజరు కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రేమ్‌కుమార్, నాగరాజు, కురుమన్న, సత్యన్న తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తున్న వాహనం పట్టివేత

ఎర్రవల్లి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న బొలెరోను అదుపులోకి తీసుకున్నట్లు ఇటిక్యాల ఎస్సై వెంకటేష్ మంగళవారం తెలిపారు. మండల పరిధిలోని తిమ్మాపురానికి చెందిన కృష్ణ తన బొలెరో వాహనంలో సోమవారం అర్ధరాత్రి రంగాపురం వైపు నుంచి ఎర్రవల్లి మండల కేంద్రానికి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా బీచుపల్లి దగ్గర పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు పట్టుకున్నారు. బొలెరోను స్టేషన్‌కు తరలించి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇసుక డంప్ సీజ్

రాజోళి: మండల కేంద్రం రాజోళిలో అనుమతులు లేకుండా నిల్వ ఉంచిన ఇసుక డంప్‌ను రెవెన్యూ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. రాజోళిలోని తుంగభద్ర నది నుంచి ఎద్దుల బండ్లతో ఒడ్డుకుని చేర్చుకుని నిల్వ ఉంచిన 60 బండ్ల ఇసుక గుర్తించి సీజ్ చేసి పోలీసులకు సమాచారమిచ్చినట్లు ఆర్ఐ చంద్ర కాంత్ తెలిపారు.

వడ్ల లారీ బోల్తా

కేటీదొడ్డి: ప్రమాదవశాత్తు వడ్ల లారీ బోల్తా పడిన ఘటన మంగళవారం రాత్రి కుచినెర్ల గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని చింతలకుంట గ్రామం నుంచి వడ్ల లారీ రాయిచూర్ వెళ్తున్న క్రమంలో కుచినెర్ల గ్రామ శివారులోని మూల మలుపు వద్ద ప్రమాదవశాత్తు బోల్తా పడింది. ప్రమాదంలో డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ఏఎంవీఐగా ఉద్యోగం సాధించిన అనిరుధ్



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: అలంపూర్ మండలం గొందిమల్లకు కేంద్రానికి చెందిన అనిరుధ్ అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్(ఏఎంవీఐ)గా ఉద్యోగం సాధించాడు. సోమవారం హైదరాబాద్‌లో నియామక పత్రాన్ని రాష్ట్ర రవాణా శాఖాధికారి రమేష్ చేతుల మీదుగా అందుకున్నారు. జిల్లా మాజీ ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వర్లు, పద్మజాల కుమారుడు అనిరుధ్. ఏఎంవీఐగా ఉద్యోగం సాధించిన అనిరుధ్‌కు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

శతాధిక వృద్ధురాలు మృతి



మానవపాడు: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఉల్చాల తిమ్మక్క(105) అనే వృద్ధురాలు మంగళవారం మృతి చెందింది. గత మూడు సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమెకు మొత్తం 10 మంది సంతానం కాగా 5 మంది మృతి చెందారు. వృద్ధురాలి మృతిపై కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

ఎంపీడీఓకు వినతిపత్రం అందజేత

మానవపాడు: పంచాయతీ సెక్రటరీ ఖాజా 2013 నుంచి 2018 వరకు సంబంధించిన ఎంబీ వర్క్ వివరాలు ఇవ్వలేదని మాజీ సర్పంచ్ ఉసెనమ్మ, అలంపూర్ తాలూకా అధ్యక్షుడు మాదిగ జయరాజ్, కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు మధు అన్నారు. ఈ నేపథ్యంలో 2017–2018 చేసిన బీఎంబీ వర్క్, 13వ ఫైనాన్స్‌కు సంబంధించిన వివరాలు ఇవ్వాలని సమాచార చట్టం ప్రకారం ఎంపీడీఓ భాస్కర్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

పోషణ లోపం.. అధిగమిద్దాం

- చిన్నారులు ఆరోగ్యంగా ఎదిగేలా ప్రభుత్వం చర్యలు
- ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలు
- ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన చర్యలు



మానవపాడులో గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్న అధికారులు



మానవపాడులో పోషణమాసం నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

మానవపాడు: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం, మాతాశిశు సంరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా వరకు పోషణ్ అభియాన్ మాసోత్సవం పేరుతో పలు కార్యక్రమాలను నిర్వహిస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఎదుగుదల, గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహారం, ఆరోగ్య సంరక్షణ తదితర అంశాలపై అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు అవగాహన కల్పిస్తున్నారు. అలంపూర్ నియోజకవర్గంలోని 7మండలాల్లో దాదాపు 124 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వాటిలోని అంగన్‌వాడీ సెంటర్ల వివరాలు..

మండలాల వారిగా మినీ అంగన్‌వాడీ సెంటర్లు, అలంపూర్– 2, ఇటిక్యాల–1, మానవపాడు– 3, ఉండవెల్లి–5, వడ్డెపల్లి– 0, రాజోలి–1 ఉన్నాయి.

తీసుకోవాల్సిన ఆహారం

గ్రామాల్లో గర్భిణిలు, బాలింతలు చిన్నారులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తూ.. రక్తహీనత నివారణకు కృషి చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఇప్పటికి చాలా మంది రక్తహీనతతో బాధపడుతున్నారు. దీనిని గుర్తించిన ప్రభుత్వం మరింత మెరుగైనా పోషకాహారాన్ని తీసుకునేలా వాటి ప్రాధాన్యతను ప్రజలకు వివరిస్తున్నారు.

మండలం.	అంగన్‌వాడీ సెంటర్లు	7 నెలలు నుంచి 3ఏళ్లు	6ఏళ్లలోపు	గర్భిణులు	బాలింతలు
అయిజ	81	3626	3209	816	754
అలంపూర్	39	1177	1022	295	300
ఇటిక్యాల	59	1284	1144	443	399
మానవపాడు	34	785	634	251	222
ఉండవెల్లి	29	744	588	223	204
వడ్డేపల్లి	29	918	752	285	229
రాజోళి	36	485	462	323	282

చిన్నారుల ఎదుగుదలపై దృష్టి...

ఐసీడీఎస్ అధికారులు అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షిస్తారు. చిన్నారులు బరువు, వయస్సుకు తగ్గ ఎత్తు అనే వివరాలు నమోదు చేస్తారు. పోషకాహారం అందించిన తర్వాత ఎంత మేర పెరిగారు వివరాలు సేకరిస్తారు. రక్తహీనత తగ్గించి పోషక విలువలు పెంచి మహిళల్లో హీమోగ్లోబిన్ శాతం పెరిగేలా చేయడమే పోషణ మాసం ముఖ్య ఉద్దేశ్యం. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారుల భుజం చుట్టూ కొలతల విధానాన్ని అనుసరిస్తున్నారు. ఈ విధానం తీవ్ర పోషకాహార లోపంతో ఉన్న వారిని తేలికగా గుర్తిస్తారు. వారి ఆరోగ్య పరిస్థితిని మెరుగుపర్చేందుకు వ్యక్తిగతంగా కూడా చర్యలు తీసుకుంటారు.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం..



శిశువు పుట్టినప్పటి నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గర్భిణిలు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్నాం. అనుబంధ ఆహారం గురించి వివరిస్తున్నాం. పోషణ బీ, పడాయ్ బీతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత, కాలనుగుణ వ్యాధులకు గురవకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆయా గ్రామాల అంగన్‌వాడీ సెంటర్లలో సూచిస్తున్నాం.

– జ్యోతి చెన్నిపాడు, అంగన్‌వాడీ టీచర్

శాఖలను భాగస్వాములను చేస్తున్నాం..



ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలు, స్థానిక సంస్థలు, వివిధ శాఖలను పోషణ మాసంలో భాగస్వాములను చేస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఇందులో భాగంగా ప్రజలు, లబ్ధిదారులతో మమేకమై పోషకాహార ప్రాధాన్యత, రక్తహీనతకు గురి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్నాం. తల్లి పేరిట మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాం.

– సుజాత సీడీపీఓ, ఐసీడీఎస్ మానవపాడు

కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి



గట్టులో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు వెంకటేష్

గట్టు: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహకార అధికారి శ్రీనివాస్, గద్వాల మార్కెట్ కమిటీ అధ్యక్షుడు హనుమంతు అన్నారు. మంగళవారం గట్టు, ఆలూరు గ్రామాల్లో సహకార సంఘం ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాలను గట్టు పీఏసీఎస్ అధ్యక్షుడు వెంకటేష్, తహసీల్దార్ సరితారాణిలతో కలిసి ప్రారంభించారు. రైతులు పండించిన పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధరతో కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. సన్నరకం ధాన్యానికి రూ. 2320తో పాటు అదనంగా రూ.500 బోనస్ చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. ధాన్యాన్ని విక్రయించే క్రమంలో పట్టాదారు పాసుపుస్తం, ఆధార్ కార్డు అందజేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రామకృష్ణారెడ్డి, మోహన్‌గౌడు, నర్సన్‌గౌడు, ఆనంద్‌గౌడు, సంతోష్, బజారి, రాజప్ప, తిమ్మయ్య, రఘుకుమార్‌శెట్టి, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

రెండో ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలి

పాన్‌గల్: రెండో ఏఎన్ఎంలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘం నాయకులు మాట్లాడుతూ.. వయస్సు పైబడిన వారికి రూ.10 లక్షల గ్రాట్యుటీ ఇవ్వాలని, వయస్సు రీత్యా పరీక్ష రాసే అర్హత లేని వారికి వంద శాతం గ్రాస్ శాలరీని అమలు చేయాలని, రూ.పది లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ ఇవ్వాలని, ఇతర రాష్ట్రాల్లో ఎటువంటి పరీక్షలు లేకుండా రెగ్యులర్ చేస్తున్నారని అన్నారు. డిపార్టుమెంట్ పరీక్ష ద్వారా నియమకాలు చేపట్టేలా అవకాశం కల్పించాలని కోరారు.

రెవెన్యూ ఉద్యోగుల నిరసన



అలంపూర్‌లో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

అలంపూర్: వికారాబాద్ జిల్లా కలెక్టర్, అధికారులపై జరిగిన దాడిని ఖండిస్తూ రెవెన్యూ అధికారులు నిరసన చేపట్టారు. అలంపూర్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం తహసీల్దార్ మంజుల, రెవెన్యూ అధికారులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐలు మాసూం బాష, సచిత్ర, సీనియర్ సహాయకులు కరీం, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



క్యాతూర్‌లో సమగ్ర సర్వేను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఈఓ భాగ్యలక్ష్మి



పెద్దదిన్నెలో సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ నరేందర్



గుడుదొడ్డిలో సర్వే చేస్తున్న ఎన్యూమరేటర్లు

అయిజ: ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సర్వే మున్సిపాలిటీ, మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం ఎన్యూమరేటర్లు నిర్వహించారు. సర్వేలో ఎలాంటి తప్పులు దొర్లకుండా అధికారులు చర్యలు చేపట్టారు. మున్సిపాలిటీలో తహసీల్దార్ జ్యోతి, మున్సిపాలిటీ మేనేజర్ అశోక్ రెడ్డి, మండలంలో ఎంపీడీఓ వెంకటయ్య సర్వే పనులు పరిశీలించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

మానవపాడు: గ్రామాల్లో సమగ్ర సర్వే ముమ్మరంగా నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ భాస్కర్ అన్నారు. మంగళవారం మండలంలోని ఆయా గ్రామాల్లో సర్వే చేపట్టారు. సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మల్దకల్: మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం ఎన్యూమరేటర్లు ఇంటింటి సర్వే ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. మల్దకల్, సద్దలోనిపల్లి గ్రామాల్లో ఎన్యూమరేటర్లు నిర్వహిస్తున్న సర్వేను ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, ఎంపీఓ రాజశేఖర్‌లు పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఎన్యూమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

రాజోళి: మండల కేంద్రం రాజోళితో పాటు ఆయా గ్రామాల్లో మంగళవారం అధికారులు సర్వే నిర్వహించారు. స్టిక్కరింగ్ వేసిన ప్రతి ఇంటికి అధికారులు వెళ్లి సర్వేకు కావాల్సిన వివరాలు నమోదు చేసుకున్నారు. మండలంలో మొత్తం 844 ఇళ్లు సర్వే నిర్వహించినట్లు ఎంపీడీఓ ఖాజా మొయినుద్దీన్ పేర్కొన్నారు.

కేటీదొడ్డి: మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టిన సర్వేను తహసీల్దార్ సాయిదా బేగం, ఎంపీడీఓ కృష్ణమోహన్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్వేలో ఎన్యూమరేటర్లు తప్పులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎన్యూమనేటర్లు తదితరులు పాల్గొన్నారు.

గట్టు: ఇంటింటా సమగ్ర సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి గోవిందయ్య ఎన్యూమరేటర్లకు సూచించారు. మంగళవారం గొర్లఖాన్‌దొడ్డి గ్రామంలో నిర్వహిస్తున్న సమగ్ర సర్వేను ఎంపీడీఓ చెన్నయ్యతో కలిసి పరిశీలించారు. తప్పులకు అవకాశం లేకుండా వివరాలు నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం సాంబశివుడు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రవల్లి: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో సమగ్ర కుటుంబ సర్వే మంగళవారం ముమ్మరంగా కొనసాగింది. వివిధ గ్రామాల్లో కొనసాగిన కుటుంబ సర్వేను ప్రత్యేక అధికారులు పరిశీలించారు.

ఇటిక్యాల: సమగ్ర కుటుంబ సర్వే మండలంలో ముమ్మరంగా సాగుతోంది. మంగళవారం మండలంలోని శివనంపల్లి, పెద్దదిన్నె గ్రామాల్లో కుటుంబ సర్వేను తహసీల్దార్ నరేందర్ పరిశీలించారు. ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్తలు వివరాలు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారులు, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

సర్వే పరిశీలించిన డిప్యూటీ సీఈఓ

అలంపూర్ రూరల్: అలంపూర్ మండల పరిధిలోని క్యాతూర్, కోనేర్, లింగన్‌వాయి గ్రామాల్లో నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేను మంగళవారం డిప్యూటీ సీఈఓ భాగ్యలక్ష్మి, ఎంపీడీఓ పద్మావతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్యూమరేటర్లకు సూచనలను, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలి

ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి జితేందర్



ప్రయాగ్ పాఠశాలలో క్రీడా జ్యోతి వెలిగిస్తున్న జితేందర్

అలంపూర్: జాతీయ స్థాయి క్రీడల్లో విద్యార్థులు రాణించాలని ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి జితేందర్ అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని ప్రయాగ్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో క్రీడోత్సవం–2024ను మంగళవారం నిర్వహించారు. ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి జితేందర్, జిల్లా క్రీడా అధికారి ఆనంద్ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రీడాజ్యోతిని వెలిగించి క్రీడలు ప్రారంభించారు. మ్యూజికల్ చైర్స్, క్రికెట్, ఫుట్‌బాల్, త్రోబాల్, బాస్కెట్ బాల్, ఖోఖో వంటి క్రీడలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌జీఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ...క్రీడలు వికాసానికి, శరీర దృఢత్వం, చురుకుదనంతోపాటు జ్ఞాపక శక్తిని పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్వే పారదర్శకంగా చేపట్టాలి



వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కేటీదొడ్డి: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే పారదర్శకంగా చేపట్టాలని ఎమ్మార్పీఎస్ నాయకులు మంగళవారం తహసీల్దార్ సాహిదా బేగంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గట్టు మండలంలోని బీసీ–బీ గ్రూపులోని కురుబ కులానికి చెందిన వారు ఎస్సీలమని మాదాసి కురువ, మాదారి కురువలమని తప్పుడు సమాచారం ఇచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు జంబయ్య, తాయప్ప, ఏసన్న పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం



కుర్తిరావుల చెర్వులో సభ్యత్వ నమోదులో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

మల్దకల్ : ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చర్లగార్లపాడు, కుర్తిరావులచెర్వు గ్రామాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, రూ.500లకే గ్యాస్, రెండు లక్షల రుణమాఫీ వంటి పథకాలు అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. అనంతరం మొబైల్ యాప్ ద్వారా కాంగ్రెస్ పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో రామక్రిష్ణ, మల్లికార్జునగౌడ్, నర్సింహులు, లక్ష్మన్న, వెంకటన్న గౌడ్, నర్సింహులు, జనార్దన్ గౌడ్, భీముడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపన్యాస పోటీలు



మల్దకల్‌లో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ సురేష్

మల్దకల్: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో మంగళవారం నడిగడ్డ తెలంగాణ సోషల్ ఫోరం ఆధ్వర్యంలో మండల స్థాయి ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఇన్‌చార్జీ ఎంఈఓ సురేష్ హాజరై మాట్లాడారు. ప్రతి విద్యార్థి ఆత్మవిశ్వాసంతో లక్ష్యాలు సాధించాలన్నారు. విద్యార్థులకు నెలకొన్న భయాన్ని పొగొట్టేందుకే ఉపన్యాస, వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బిజ్వారం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని స్పందనకు మొదటి బహుమతి, మల్దకల్‌కు చెందిన మంజులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నడిగడ్డ తెలంగాణ సోషల్ ఫోరం అధ్యక్షుడు పాల్వాయి లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు జాకీర్ హుసేన్, విష్ణు, గోవిందు, రాజేశ్వర్‌రెడ్డి, నాగేశ్వరరావు, జ్యోతి, పద్మ, ప్రదీప్, విష్ణు రేణుక తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపై మక్కువ ఉండాలి



ఎర్రవల్లిలో పోటీలు ప్రారంభిస్తున్న కమాండెంట్, తదితరులు

ఎర్రవల్లి: ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరికి క్రీడలపై మక్కువ ఉండాలని పదో బెటాలియన్ కమాండెంట్ సాంబయ్య, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దీపక్ ప్రజ్ఞ అన్నారు. మంగళవారం ఎర్రవల్లి మండల కేంద్రంలో హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నీని ముఖ్య అతిథులుగా హాజరై వారు ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శరీర దృఢత్వం, ఫిజికల్ ఫిట్నెస్ సాధించవచ్చన్నారు. యువత చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ దొడ్డెప్ప, అలంపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జోగుల రవి, జోగుళాంబ ఆలయ డైరెక్టర్లు నాగ శిరోమణి, జోగుల సరస్వతి, మండలాధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, కుమార్, రాము, లక్ష్మన్న, గోపాల్, రాజ్‌కుమార్, రాజు, వెంకటన్న తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు

అలంపూర్: అలంపూర్ పట్టణంలోని సంతోష్‌నగర్ కాలనీకి చెందిన లక్ష్మీదేవికి మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కును యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నరసింహ్మ మంగళవారం అందజేశారు. వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా రూ.12,500 మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో రాముడు, ఎల్లన్న, బుచ్చన్న, జాన్ తదితరులు పాల్గొన్నారు.

అయిజ: మండలంలోని పులికల్ గ్రామానికి చెందిన కురువ రంగన్నకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి రూ.19,000ల చెక్కును మంగళవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బర్కి దేవన్న అందజేశారు. ప్రభుత్వం నిరుపేదలకు తోడుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సుధాకర్ గౌడ్, రంగస్వామి, తిమ్మోతీ, దేవరాజు, లోకయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మల్దకల్ ఎస్సైపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు

గద్వాల అర్బన్: మల్దకల్ మండలం బిజ్వారం గ్రామానికి చెందిన మైనర్ బాలిక మృతి కేసులో మల్దకల్ ఎస్సైపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని అఖిల పక్షం, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని స్మృతివనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. చర్యలు తీసుకోని పక్షంలో పోరాటం చేయనున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు సుభాన్, బహుజన రాజ్యసమితి అధ్యక్షుడు వాల్మీకి, బీఆర్ఎస్వీ జిల్లా కో ఆర్డినేటర్ కుర్వ పల్లయ్య, తెలంగాణ రైతాంగ సమితి ప్రధాన కార్యదర్శి గోపాల్ యాదవ్, టీపీఎఫ్ నాయకుడు ప్రభాకర్, కేఎన్‌పీఎస్ నాయకుడు రవి పాల్గొన్నారు.

డీసీఎం, ట్రాక్టర్ ఢీ.. ఇరువురికి గాయాలు

ఉండవెల్లి: జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న డీసీఎం, పత్తి లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. మంగళవారం రాత్రి మానవపాడు మండలం బోరవెల్లి నుంచి కుర్వ నరసింహ ట్రాక్టర్‌లో పత్తిని సీసీఐ కొనుగోలు కేంద్రానికి తరలిస్తుండగా కర్నూల్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న డీసీఎం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ట్రాక్టర్ ఒక్కసారిగా బోల్తా పడటంతో రైతు నరసింహకు, డీసీఎం డ్రైవర్ ప్రవీణ్ పటేల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులకు హైవే అంబులెన్స్‌లో చికిత్స అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, హైవే సిబ్బంది దర్యాప్తు చేస్తున్నారు.



బోల్తా పడిన ట్రాక్టర్